నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
1
నిజామాబాద్-కామారెడ్డి
సోమవారం | నవంబర్ 04, 2024 | www.navatelangana.com

పైప్‌లైన్ లీకేజీ.. ఏర్పడిన గుంత

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి నుంచి మంగల్‌పాడ్ వెళ్లే ప్రధాన రహదారిపై గత 15 రోజుల నుంచి మిషన్ భగీరథ పైప్ లీకేజీ అవుతోంది. దీంతో ఆ ప్రాంతంలో చిన్నపాటి గుంత ఏర్పడింది. స్థానికులు గమనించి ముండ్ల పొదను లీకేజ్ అవుతున్న పైపు గుంత చుట్టూ వేశారు. రైతులు పనులు ముగించుకొని ఇదే దారి గుండా వెళ్తారు. సుమారు ఐదు రోజుల క్రితం గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు సైతం గుంతలో పడిపోయారు. అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు చేపట్టి.. గుంత వద్ద మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.


రోడ్డు పక్కనే లీకేజీ

చెరువులో పడి ఇద్దరు మృతి

- మోపాల్ మండలం మంచిప్పలో ఘటన

నవతెలంగాణ-మోపాల్

ప్రమాదవశాత్తు చెరువులో పడి ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని మంచిప్ప గ్రామంలో చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి మంచిప్ప గ్రామంలోని దర్గా వద్దకు ఆరుగురు రాగా.. వారిలో ఇద్దరు చెరువులో నీటమునిగి చనిపోయారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసులు వెల్లడించారు.

వివరాలు మెయిన్‌లో..


యాకూబ్ మృతదేహం

ఆదర్శం.. అంధకారం

- లోపించిన పారిశుధ్యం
- ఇది లింగంపేట్ మండల కేంద్రం దుస్థితి
- దత్తత ఉత్తమాటేనా..?

లింగంపేట్ పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నా.. అవి వట్టి మాటలేనని తేలిపోతున్నాయి. అందుకు నిదర్శనం మండల కేంద్రం సమస్యల కొట్టుమిట్టాడటమే. మండల కేంద్రంలో పారిశుధ్యం లోపించింది. మురికి కాల్వల్లో చెత్తచెదారాం పేరుకుపోయింది. తద్వారా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇదిలా ఉండగా.. మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు దీపాలు వెలగకపోవడంతో అంఙకారంగా మారింది.


విద్యుత్ స్థంభాలున్నా.. వెలగని దీపాలు

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ పట్టణానికి రాష్ట్రవ్యాప్తంగా చారిత్రాక రంగాలతోపాటు రాజకీయ రంగాల్లో ప్రత్యేకత ఉంది. కానీ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో పాలనా యంత్రంగా పూర్తిగా విఫలమవుతుందని సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. లింగంపేట్ మండల కేంద్రంలో రోడ్లపై ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిస్తోంది. మురికి కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారంతో మురికి నీరు నిలిచిపోయి దోమలు వ్యాపించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇప్పటికే లింగంపేట పట్టణం సీజనల్ వ్యాధుల్లో జిల్లాల్లో ప్రథమ స్థానంలో ఉంది. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా లాంటి వ్యాధులతో పట్టణ ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. వేలాది రూపాయలు ఖర్చుపెట్టి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సలు పొందారు. ప్రత్యేక అధికారుల పాలన పూర్తిగా పడకేసినట్లు ఉందని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అంధకారంలో లింగంపేట్..

లింగంపేట పట్టణాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ గత నెల రోజుల క్రితం ప్రకటించారు. ప్రస్తుతం నెల రోజులు పూర్తయినప్పటికీ రాత్రివేళ అంధకారంలోనే ఉంటుంది. లింగంపేట్ అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్ వెలిగినా పాక్షికంగా దర్శనమిస్తుంది. ఎల్లారెడ్డి, కామారెడ్డి ప్రధాన రహదారి వద్ద నిత్యం జనసంచారం ఉంటుంది. 24 గంటలు వాహనాలు తిరిగే రోడ్డు ఇది. కానీ ఆ రోడ్డు గుండా ఇరువైపులా విద్యుత్ స్తంభాలకు విద్యుత్ దీపాలు లేకపోవడంతో అంధకారంలో ప్రజలు జీవనం కొనసాగిస్తున్నారు. కేవలం వ్యాపార సముదాలకు సంబంధించిన విద్యుత్తు వెలుగులతోనే సరిపెట్టుకుంటున్నారు. రాత్రి వేళలో అంధకారం ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన రహదారిపై పశువులు పడుకోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ప్రజలు చెబుతున్నారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి గ్రామపంచాయతీ వరకు వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో చీకట్లోనే జీవనం సాగిస్తున్న పరిస్థితి నెలకొంది. అంబేద్కర్ చౌరస్తా నుంచి గ్రామపంచాయతీ వరకు రోడ్డుపై దుమ్ముధూళి పేరుకుపోతుంది. దీంతో వాహనాలు ప్రయాణించేటప్పుడు ఆ దుమ్ము ధూళి అంతా దుకాణాలలోకి వచ్చి చేరుతుందని వారు అంటున్నారు.

లింగంపేట్‌లో జరుగుతున్న వీక్లీ మార్కెట్లో చెత్త సేకరించకపోవడంతో చెత్త గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తుంది. కుళ్ళిపోయిన కూరగాయలు అలాగే ఉంటున్నాయి. రోజువారి సంత కల్లు డిపో సమీపంలో కట్టు కాలువలో చెత్తచెదారం పేరుకుపోయి మురికి నీరు నిల్వ ఉండి దుర్వాసన రావడంతో చుట్టుపక్కల నివసించేవారు వాసనను తట్టుకోలేకపోతున్నారు. రోజువారీగా మురికి కాల్వ సమీపంలో మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు కూరగాయలు విక్రయిస్తున్నప్పటికీ కూరగాయలు కొనాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.


ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

లింగంపేట పట్టణ కేంద్రంలో కేవలం ప్రధాన రహదారికిరువైపులా చెత్తను తొలగించారు తప్ప మిగతా కాలనీలో పిచ్చిమొక్కలు, చెత్తచెదారం పేరుకుపోయి ప్రజలు నడవలేక పోతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సమీపంలోని మురికి కాలువ చెత్త చెదారంతో నిండిపోయింది. సమీపంలో కస్తూర్బా గురుకుల పాఠశాల ఉండడంతో విద్యార్థులు రోగాల బారిన పడకుండా పాలన యంత్రాంగం చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యేక అధికారుల పాలన పడకేసింది..

గత కొన్ని నెలలుగా ప్రత్యేక అధికార పాలన కొనసాగుతున్నప్పటికీ ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీలో నిధులు మంజూరైనప్పటికీ ప్రత్యేక అధికారుల పాలనలో పారిశుధ్యం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందగా మారింది. ఇప్పటికైనా ప్రత్యేక అధికారులు స్పందించి పట్టణాన్ని శుభ్రంగా తీర్చిదిద్దాలని ప్రజలను రోగాల భారి నుంచి కాపాడాలని, అలాగే లింగంపేట పట్టణంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


పేరుకుపోయిన చెత్తచెదారం


మురికి కాలువ దుస్థితి

పిచ్చి మొక్కలు ఇలా.. ప్రయాణం చేసేదెలా..?

పట్టించుకునే వారు కరువు.. వాహనదారులకు ఇబ్బందులు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని అమర్లబండ నుంచి తాడ్వాయి మండలంలోని కన్‌కల్ గ్రామానికి వెళ్లే లింకు రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే వాహనదారులు భయపడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని ద్విచక్ర వాహనదారులు అంటున్నారు. కండ్లల్లో గుచ్చుకునేలా మొక్కలున్నాయి. రాత్రి వేళల్లో అయితే పెద్దపెద్ద ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు పెద్ద వాహనాలకు కూడా ఇబ్బందికరంగానే ఉన్నట్లు వాహనదారులు తెలిపారు. ఈ రోడ్డు గుండా ఎర్రపహడ్, తాడ్వాయి, ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాలకు కూడా ఈ రోడ్డు గుండా ప్రయాణం చేస్తుంటారు. ప్రతిరోజు వందల వాహనాలు ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తుంటాయి. వాటిని పట్టించుకునే నాథుడే కరువయ్యారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని కోరుతున్నారు.


రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

ప్రయాణం.. భయంభయం..

- గుంతలుగా నిజామాబాద్, బోధన్ ప్రధాన రహదారి
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు


గుంతలతో ప్రమాదకరంగా మారిన రోడ్డు

నవతెలంగాణ-ఎడపల్లి

నిజామాబాద్ నుంచి బోధన్ వెళ్లే ప్రధాన రహదారిపై ప్రయాణించాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోధన్, నిజామాబాద్ ప్రధాన రహదారి అలీసాగర్ ఎత్తిపోతల పథకం కాలువ వద్ద రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు గుండా నిత్యం వేల సంఖ్యలో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, బస్సులు ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎత్తిపోతల కాల్వ ఉండడం వలన ప్రయాణికులు ప్రయాణం చేసే ముందు అదుపు తప్పితే అంతే సంగతి. సుమారు అర కిలోమీటర్ పొడవునా రోడ్డు పూర్తిగా గుంతలుగా మారింది. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి గుంతలుగా ఉన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. పక్షం రోజుల క్రితం ఆటో గుంతలో దిగబడి బోల్తా కొట్టడంతో కొంతమందికి తీవ్ర గాయాలయ్యాయి. అయినప్పటికీ రోడ్ల భవనాల శాఖ అధికారులు రోడ్లను మరమ్మతులు చేయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్
- వరి కొనుగోలు కేంద్రాల తనిఖీ


రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

నవతెలంగాణ-సదాశివనగర్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ అన్నారు. మండలంలోని వరి కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ వరి కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా వ్యవసాయ అధికారి ఏఈఓలకు, సొసైటీ సిబ్బందికి, రైతులకు పలు సూచనలు చేశారు. వరి కొనుగోలు కేంద్రంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. వరి కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు కాంటాలను ప్రారంభించారు. మండలంలోని పద్మాజివాడి, ధర్మారంపేట్, సదాశివనగర్ కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రజాపతి, ఏఈవోలు శ్రీలక్ష్మి, కవిత, శ్రీనివాస్ నాయక్, సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీ ఉపాధ్యాయురాలికి సన్మానం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామానికి చెందిన హరి వినోద ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో ఎస్జీటీ ఉపాధ్యాయ పోస్టుకు అర్హత సాధించింది. దీంతో గ్రామ మున్నూరుకాపు సదర్ సంఘం ఆధ్వర్యంలో వినోద దంపతులను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ముదాం స్వామి, కార్యదర్శి హరి రవి, కోశాధికారి గాడి నర్సింలు, కులపెద్దలు గాడి రవి, కొమ్ము భాస్కర్, గాడి రమేశ్, కిష్టయ్య, రాజయ్య పాల్గొన్నారు.


ఉపాధ్యాయురాలి దంపతులకు సన్మానం

ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుంటే ఉద్యమం

- మాలలు ఎవరు చెప్పినా వినరా ?
- 59 కులాల ఆస్తి ఒక్కరికే కావాలంటే అది సమానత్వమా ?
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుంటే ఉద్యమం చేస్తామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ హెచ్చరించారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఈఎస్ఆర్ గార్డెన్‌లో మాదిగల ధర్మయుద్ధ మహాసభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా మందకృష్ణ హాజరై మాట్లాడుతూ.. మాలలు రాష్ట్రపతి, ప్రధానమంత్రి, చివరికి సుప్రీంకోర్టు చెప్పిన వినడం లేదన్నారు. 59 కులాల ఆస్తి ఒకరికే కావాలంటే అది న్యాయమా అని ప్రశ్నించారు. సమానత్వం 59 కులాలకు సమాన వాటా అందించాలనేది ఆనాటి అంబేద్కర్ కళా అని తెలిపారు. ఆ కళను మనం నిజం చేయాలని పిలుపునిచ్చారు. త్వరలో ఏ నిర్ణయం తీసుకున్నా.. ఆ నిర్ణయానికి కట్టుబడి ఉండాలని మాదిగలకు పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణ తక్షణమే అమలు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మాజీ రాష్ట్ర కార్యదర్శి బట్ట వెంకట రాములు, ఎమ్మార్పీఎస్ మహిళ విభాగం జిల్లా అధ్యక్షురాలు సత్తిగారి లక్ష్మి, సామెల్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ప్రమోద్, పోశెట్టి, పురుషోత్తం, బాలరాజు, పద్మారావు, లావణ్య, బట్ట రమేష్, కొంగల భూమేష్, రాజ నరసయ్య, యాదయ్య టీచర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మందకృష్ణ మాదిగ

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

- ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి
- గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-భిక్కనూర్

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అన్నారు. మండలంలోని సిద్ధ రామేశ్వరనగర్ గ్రామ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జంగంపల్లి గ్రామ శివారులో బిటిఎస్ సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాలలను ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటశాలలు, విద్యార్థుల సౌకర్యాలు పరిశీలించారు. గురుకుల పాఠశాలలో సమస్యలు, విద్యా బోధన, వసతులు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందే విధంగా, ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు. ఈ పరిశీలనలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రతి గింజనూ కొంటాం

- రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాలరాజ్

నవతెలంగాణ-వర్ని(చందూర్)

రైతుల వద్ద నుంచి ప్రతి ధాన్యం గింజనూ కొంటామని రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం చందూర్ మండల కేంద్రంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యం కొనుగోలుపై ఎలాంటి ఆందోళన చెందకూడదని అన్నారు. సన్నరకానికి రూ.2320 తో పాటు క్వింటాకు రూ.500 బోనస్ కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి రైతుల ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. నియోజకవర్గంలో రైతులకు ఎప్పుడూ తాను అండగా ఉంటానని హామీనిచ్చారు. అలర్ట్‌మెంట్ అయిన రైస్‌మిల్లర్ యాజమాన్యం ధాన్యాన్ని త్వరగా కొనుగోలు చేయాలని కూడా సూచించామని పేర్కొన్నారు. రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి లాభం పొందాలని కోరారు. సొసైటీ చైర్మన్‌లు రైతుల వద్దకు వెళ్లి వారి ధాన్యాన్ని కొనుగోలు చేసేలా చూడాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ కాసుల బాలరాజు, సొసైటీ చైర్మన్ ప్యారం అశోక్ యాదవ్, వైస్ చైర్మన్ తారాచందు, మాజీ సర్పంచ్‌లు కర్లం సాయరెడ్డి, సత్యనారాయణ, మేడిపల్లి రవి, పార్టీ మండల అధ్యక్షులు మూడ్ అంబర్ సింగ్, మాజీ జడ్పీటీసీ అంబర్ సింగ్, రాంజ్యా నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుధాకర్‌రావు, పార్టీ నాయకులు సాయిలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని బస్వాపూర్ గ్రామంలో ఎస్సీ కాలనీకి చెందిన కుమార్ మరణించడంతో ఎస్సీ కుల సంఘం ఆధ్వర్యంలో సంఘం సభ్యులు బాధిత కుటుంబానికి ఆదివారం ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కుల సంఘం సభ్యులు రవికుమార్, భూషణం, సంజీవ్, నర్సింలు, కుల సంఘం సభ్యులు, గ్రామస్తులు, తదితరులున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
సోమవారం | నవంబర్ 04, 2024 | www.navatelangana.com

ధర్మసమాజ్ పార్టీ ప్లీనరీకి తరలిన నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన ధర్మసమాజ్ పార్టీ ప్లీనరీ కార్యక్రమానికి డిచ్‌పల్లి మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతేడాది సరూర్ నగర్‌లో శారదన్ ఆధ్వర్యంలో ధర్మసమాజ్ పార్టీని స్థాపించారని వారు పేర్కొన్నారు. సబ్బండ కులాలు, పేదల సంక్షేమం కోసం పార్టీ కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు సుభాష్, నాయకులు మోహన్, దాసు, పోచయ్య, రాకేష్, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొలం బాట



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని అంకాపూర్ గ్రామంలో విద్యుత్ శాఖ అధికారులు ఆదివారం రైతు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పంట పొలాల్లో వంగిపోయిన పోల్స్‌ను, లూస్ లైన్స్‌ను, కట్ అయిన సపోర్ట్ వైర్స్ సరిచేసే పనులు చేశారు. ట్రాన్స్కో డీఈ రాజేశ్వరరావు, ఏడీఈ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఈ మనీషా, లైన్ ఇన్‌స్పెక్టర్లు నరేందర్ నాయక్, కుమారస్వామి, లైన్మెన్, అసిస్టెంట్ లైన్మెన్లు తదితరులు పాల్గొన్నారు.

నర్సింలు కుటుంబాన్ని ఆదుకుంటాం

• ముప్పగంగారెడ్డి



మాట్లాడుతున్న ముప్పగంగారెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని ఒడ్డెర కాలనీ గ్రామానికి చెందిన కొంరే నర్సింలుకు గత మూడు నెలల క్రితం దుబాయ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోయాయి. ఈ విషయం తెలుసుకున్న నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ఆయన్ను ఆదివారం పరామర్శించారు. వారి పరిస్థితిని ఎమ్మెల్యే భూపతి రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆర్థికంగా న్యాయం చేసే విధంగా చూస్తామని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అన్ని విధాలుగా ఆదుకుంటాం అని హామీఇచ్చారు.

ఉపాధ్యాయులందరినీ భాగస్వాములు చేయాలి



మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేలో కేవలం ఎస్‌జిటిలనే కాకుండా అందరు ఉపాధ్యాయులను ఆగస్వాములను చేసి దానిని తక్కువ సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలంగాణ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యయ సంఘం అధ్యక్షులు మహిపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. పిఆర్సీల కేటాయింపులో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ల మధ్య వేతన వ్యత్యాసం తగ్గించి మెరుగైన వేతనాలు అందించాలని కోరారు. ఎస్‌జిటియు జిల్లా కార్యవర్గ సమావేశం అదివారం నిజామాబాద్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ అధ్యక్ష, కార్యదర్శులు మహిపాల్ రెడ్డి, వేంకటేశం మాట్లాడుతూ.. ప్రతితరగతికి ఓక ఉపాధ్యాయుడి చొప్పున ప్రతి పాఠశాలకు కేటాయించాలని అన్నారు. ప్రధానోపాధ్యాయుడిని విద్యార్థులతో సంబంధం లేకుండా సినియార్టి ప్రకారం పదోన్నతులు ఇవ్వాలని అన్నారు. 317 జివో బాధితులకు వెంటనే న్యాయం చేసి 13 జిల్లాల స్పౌజ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. ఎస్‌జిటియూ జిల్లా అధ్యక్షులుగా యం.వేంకట రమణ, ప్రధాన కార్యదర్శిగా గంగా ప్రసాద్, మహిళ అధ్యక్షురాలిగా ప్రతిభ, ప్రధాన కార్యదర్శిగా అరుణ, స్టేట్ కార్యదర్శి వై శ్రీనివాస్ రెడ్డి, నరేష్ సోమగిరి, జిల్లా కోశాధికారిగా బదావత్ మోహన్, ఉపాధ్యక్షులుగా ప్రదిప్ రాజ్, డి అశోక్, గౌరవ అధ్యక్షులుగా నరేంధర్, జిల్లా కార్యదర్శిగా దోండి వినోద్, రోజా సంధ్యరాణి, రాజ్యలక్ష్మిల తో కుడిన కోత్త కార్యవర్గంను ఎన్నుకున్నారు.

ఐక్యు మెడిసిన్ అండ్ మోర్ మెడికల్ హాలు ప్రారంభం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని బోధన్ రోడ్డులో ఏర్పాటుచేసిన ఐక్యు మెడిసిన్ అండ్ మోర్ మెడికల్ హాల్‌ను బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలి షబ్బీర్ ఆదివారం ప్రారంభించారు.

సెపక్ తక్రా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గాధరి సంజీవ్‌రెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

అధివారం హైదరాబాద్‌లోని ఫాతే మైదాన్ క్లబ్‌లో తెలంగాణ సెపక్ తక్రా అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో నిజామాబాద్ జిల్లా సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గాధరి సంజీవ్ రెడ్డి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, అలాగే చామకూర భాగరెడ్డి కార్యవర్గ సభ్యులుగా ఎంపికయినట్లు సెపక్ తక్రా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, నుడా చైర్మన్ కేశ వేణు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా సంజీవరెడ్డి, భాగరెడ్డి కార్యవర్గ సభ్యులుగా ఎంపిక పట్ల జిల్లా అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ల్యాబ్ గంగారెడ్డి, దీపిక, సతీష్ రెడ్డి, మీసాల ప్రశాంత్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

కబడ్డీ రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులకు సన్మానం



సభ్యులను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-మెండోర

బుస్సాపూర్ గ్రామ సీనియర్ కబడ్డీ క్రీడాకారులు, నాయకులతో కలిసి కబడ్డీ సంఘం రాష్ట్ర, జిల్లా కమిటి నాయకులకు ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్బంగా తెలంగాణ కబడ్డీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.గంగాధర్ రెడ్డి, నిజామాబాదు జిల్లా కబడ్డీ సంఘం జాయింట్ సెక్రెటరీ పిడి జైడి.రాజకుమార్‌కు పూలమాలలు, శాలువాలతో సన్మానించి గిఫ్ట్ లు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ కాలంలో విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యం అని అన్నారు. కబడ్డీ రాష్ట్ర, జిల్లా సంఘాలకు నాయకులుగా ఎన్నిక కావడం గర్వకారణంగా ఉందని అన్నారు. క్రీడల పోటీల్లో విద్యార్థులకు అండగా నిలుస్తూ ఉన్నతమైన ప్రోత్సాహాలను అందిస్తూ ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సీనియర్ నాయకులు నాగంపేట.శేఖర్ రెడ్డి , గోపిడి.గంగారెడ్డి , జైడి.సాయన్న , నడిపి.సాయన్న కబడ్డీ సీనియర్ క్రీడాకారులు జెడి.సాయన్న , నొమల.శ్రీనివాస్ , సంతోష్ రెడ్డి , నూతపల్లి.శ్రీనివాస్ , నవాబ్ చిన్న రెడ్డి , కోమనపల్లి.భూమన్న , సచిన్ తదితరులు పాల్గొన్నారు.



నిధులు రాగానే పనులు చేపడతాం..

రాజు, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్.



ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. నిధులు విడుదల కాగానే పనులు జరిపించేలా చర్యలు తీసుకుంటాం..

ప్రజా ప్రతినిధులు చొరవతీసుకోవాలి

బబ్లు, స్థానికులు, ఆర్మూర్



సమీకృత మార్కెట్ నిర్మాణం ప్రారంభించి సంవత్సరం అవుతుంది. పనులు ముందుకు సాగడం లేదు. పనులను త్వరగా పూర్తిచేసి మార్కెట్‌ను అక్కడికి తరలించాలి. ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని నిర్మాణం త్వరగా పూర్తయ్యేలా చూడాలి.

ఆగిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు

తైబజార్ ద్వారా లక్షల్లో ఆదాయం

సౌకర్యాలు లేక వ్యాపారులు, రైతులకు ఇబ్బందులు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో వెజ్ అండ్ నాన్ వెజ్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో బీజం పడగా నిధులు నిలిచి పోవడంతో నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ప్రత్యేక నిధుల నుంచి ఏడుకోట్ల 20 లక్షలు మంజూరు కాగా, 44వ నెంబరు జాతీయ రహదారి పక్కన శిథిలావస్థలో ఉన్న ఆర్అండ్‌బి శాఖ కార్యాలయంతో పాటు అతిథి గృహాన్ని కూల్చివేసి అదే స్థలంలో మార్కెట్ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే ఆశన్న గారి జీవన్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికలకు ముందు పనులను ప్రారంభించారు. మొదట్లో పనులు వేగవంతంగా జరిగిన ప్రభుత్వం మారడంతో నిధులు నిలిచిపోయి పనులు ఆగిపోయాయి. నిధులు రాకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. కాగా మార్కెట్ ఏర్పాటుపై నమ్మకం పెట్టుకున్న రైతులు వ్యాపారులు నిరాశకు గురవుతున్నారు.

కూరగాయల మార్కెట్‌కు ప్రసిద్ధిగా పెర్కిట్..

పట్టణంలోని పెర్కిట్ జాతీయ రహదారులు 44, 63 నెంబరు జాతీయ రహదారుల కూడలిగా కూరగాయలు, చాపల మార్కెట్‌కు ప్రసిద్ధి గాంచింది. దీంతో పట్టణంతో పాటు సమీపంలోని బాల్కొండ, వేల్పూర్, జక్రాన్ పల్లి మండలాలకు చెందిన రైతులు తాము పండించిన కూరగాయలను ఇక్కడ విక్రయిస్తారు. అలాగే వ్యాపారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి సైతం కూరగాయలను దిగుమతి చేసుకొని హోల్‌సేల్ వ్యాపారం చేస్తుంటారు. దీంతో మార్కెట్ నిత్యం కూరగాయల వ్యాపారులు కొనుగోలుదారులతో రద్దీగా ఉంటుంది. అలాగే అక్కడికి వచ్చేవారు తమ వాహనాలను రహదారిపై పార్కింగ్ చేసి ఉండడంతో రాకపోకలకు ఆటంకం కలుగుతుంది. అలాగే మార్కెట్లో ఎలాంటి సౌకర్యాలు లేవు. కనీసం షెడ్డు సైతం లేకపోవడంతో రైతులు వ్యాపారులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ కూరగాయలు విక్రయిస్తున్నారు. తైబజార్ ద్వారా రూపాయలు లక్షల్లో ఆదాయం పొందుతున్న మున్సిపల్ శాఖ ప్రస్తుత మార్కెట్లో ఇలాంటి సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం మున్సిపాలిటీకి తైబజార్ ద్వారా 9 నెలలకు గాను 22 లక్షల 86 వేల ఆదాయం సమకూరుతున్న మార్కెట్లో ఎలాంటి వసతులు కల్పించడం లేదని వ్యాపారులు అంటున్నారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు విడుదల చేసి పనులు త్వరగా అయ్యేలా చూడాలని రైతులు వ్యాపారస్తులు కోరుతున్నారు...

80 రోజులపాటు అయ్యప్ప స్వాములకు అన్నదానం

• అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

• మహాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కంఠేశ్వర్ అయ్యప్ప ఆలయంలో ఇందూర్ అయ్యప్ప సేవ సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాన్నదాన కార్యక్రమాన్ని ముఖ్యఅతిథి అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు. మొదట అయ్యప్ప స్వామికి ప్రతేక పూజలు నిర్వహించి, అయ్యప్ప స్వాములకు భిక్ష వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయ్యప్ప మాల అంటేనే నిగ్రహానికి నిదర్శనం అని అన్నారు. ఇందూర్ నగరంలో ఉన్న అయ్యప్ప ఆలయాన్ని దర్శించుకుంటే శబరిలో ఉన్న అయ్యప్ప ఆలయాన్ని దర్శించుకున్న అనుభూతిని భక్తులు పొందుతారని అన్నారు. ఇందూర్‌లో దాదాపు 30 ఏళ్ల నుండి మాల దరిస్తున్న గుండమయ్య లాంటి గురు స్వాములు ఉన్నారని ఇందూర్ ఆలయ నిర్మాణానికి వారు ఎంతో కృషి చేసారన్నారు. జనవరి 20 వరకు మహాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న ఇందూర్ అయ్యప్ప సేవ సమితి ట్రస్ట్‌ను ఎమ్మెల్యే ను అభినందించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ భక్తవత్సలం, ఢిల్లీ ట్రస్ట్ సభ్యులు సురేష్, ఆగమయ్య జగన్ మోహన్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పలువురు

చేపల వేటకు వెళ్ళి ఒకరు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని సంస్థాన్ సిర్నపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని రాంసాగర్ తండాకు చెందిన అజ్మీరా చందర్ (49) ఆదివారం తన పొలం పక్కన గల చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాద వశాత్తు చెరువులో మునిగి మృతి చెందాడు. ఎస్‌హెచ్‌ఓ మనోజ్ కుమార్ వివరాల ప్రకారం.. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చెసుకొని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

జీవితాలను త్యాగం చేసి ఉద్యమాల వైపు నడిచారు

నవతెలంగాణ-ఆర్మూర్

దుర్గంపుడి వెంకట కృష్ణ మరణం విప్లవోద్యమనికి తీరని నష్టం అని, జీవితాలను త్యాగం చేసి ఉద్యమాలవైపు నడిచారని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ కార్యదర్శి వి. ప్రభాకర్ అన్నారు. సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో అమరవీరుల వారోత్సవాల సందర్భంగా కమ్యూనిస్టు అమరవీరులను స్మరించుకుంటూ ఆదివారం పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సబ్ డివిజన్ కమిటీ కార్యదర్శి బి, కిషన్ అధ్యక్షతన, అమరవీరులకు సంతాపన్ని తెలియజేస్తూ, ముఖ్యవ్యక్తలుగా సిపిఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి, ప్రభాకర్, డివిజన్ కార్యదర్శి బి, దేవరాం మాట్లాడుతూ.. దోపిడి పాలనకు వ్యతిరేకంగ, పెట్టుబడి దారీ వ్యవస్థను ప్రశ్నించి, పేదల పక్షాన, ప్రజా పోరాటాల్లో, ప్రాణాలను వదిలిన అమరుల ఆశయాల సాధనకు వారి బాటలో నడవాలన్నారు. ప్రభుత్వాల బూటకపు ఎన్కౌంటర్‌లకు ఎంతో మంది నేలకొరిగినా పోరాటాలు ఆగలేవని తెలిపారు. వారు కలలు కన్న సమ సమాజం కోసం మనం అందరం కలిసి పోరాడాలని, బలమైన ప్రజా ఉద్యమాలను నిర్మించాలని అన్నారు. కార్యక్రమంలో టియుసిఐ జిల్లా కార్యదర్శి, ఎం,ముత్తెన్న. సబ్ డివిజన్ కమిటీ నాయకులు, ఠాగూర్, జక్కం శేకర్, ఆకుల గంగారాం, తలారి గంగన్న, పుప్పలపల్లి గంగాధర్,రాజన్న,అమినపూర్ రమేష్, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు ఎం, నరేందర్, ఏరియా అధ్యక్షులు, కార్యదర్శి, అనిల్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.



వెంకట కృష్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జాతీయ బీసీ సంక్షేమ సంఘంలో పలువురి నియామకం



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ-కంఠేశ్వర్

జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెంపుల నాగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతనకర్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు సత్యనారాయణ చేతుల మీదుగా ఇద్దరికి నియామక పత్రాలను అందజేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏర్పాటుచేసిన కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా మండే మోహన్, జిల్లా జాయింట్ సెక్రెటరీగా నగేష్ యాదవ్, బీసీ జర్నలిస్ట్ ఫోరం ప్రధాన కార్యదర్శిగా జట్టి గోవింద రాజుకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనుగందుల మురళి, జిల్లా ఉపాధ్యక్షులుగా లక్ష్మణరావు, జిల్లా నాయకులు చింతకాయల రాజు, సురేష్, అమంద్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఓట్లను గట్టు మీద పెట్టేశారు

• ఎంపీ అర్వింద్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఎన్నికల సమయంలో ఎక్కడికి వెళ్తే అక్కడ ఒట్లు వేసిన సీఎం రేవంత్ రెడ్డి ఇప్పుడు ఆ ఓట్లను గట్టు మీద పెట్టేశారని ఎంపీ అర్వింద్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి చేతుల మీదుగా అర్వింద్ సభ్యత్వం స్వీకరించారు. అనంతరం ఎంపీ అరవింద్ మాట్లాడుతూ.. రైతులకు రుణమాఫీ, బోనస్, కళ్యాణ లక్ష్మీతో పాటు బంగారాన్ని మరిచారన్నారు. రేవంత్ రెడ్డి కేసీఆర్‌ను మించిపోయాడన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పై వ్యతిరేకత ఉందనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం లేదని, ఒక వేళ ఎన్నికలకు వెళ్తే ప్రజలు పార్టీని పాతాళానికి తొక్కేస్తారన్నారు. మంచిప్ప ప్రాజెక్టు ఫైనల్ కాకముందే రూ.2100 కోట్ల విలువైన పైపులను కొనుగోలు చేశారని విమర్శించారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఇప్పటి వరకు లెటర్ హెడ్ కొట్టించుకోలేదని, మంత్రి పదవి వస్తేనే లెటర్ హెడ్ కొట్టిస్తానని బహిరంగంగా చెబుతున్నాడన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, బోనస్ తోపాటు జిల్లాలకు ఇంటిగేటెడ్ స్కూల్ ఎప్పుడు వస్తుందో సుదర్శన్ రెడ్డి పట్టించుకోవాలని ఆయన సూచించారు.

పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు కళ్లు నెత్తిమీద ఉన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏం చేశారని పాదయాత్ర చేస్తాడని అర్వింద్ ప్రశ్నించారు. ఆయనకు చెప్పులు, చీపుర్లతో స్వాగతం పలకాలని ప్రజలకు సూచించారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చావని పాదయాత్ర చేస్తావా..?అని ప్రశ్నించారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే పాల్ సూర్యనారాయణ, బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, కార్పొరేటర్ మాస్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వం తీసుకుంటున్న ఎంపీ అరవింద్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



ఎల్లారెడ్డి మండలంలోని తిమ్మారెడ్డి, తిమ్మారెడ్డి తాండ గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రామిరెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎల్లారెడ్డి మండలాధ్యక్షుడు కురుమ సాయిబాబాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, పిఎసిఎస్ డైరెక్టర్ గోపికృష్ణ, సింగిల్ విండో చైర్మన్ పటేల్ సాయిలు, డైరెక్టర్ గంగారెడ్డి, తిమ్మారెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సామేల్, కిష్టారెడ్డి, గంగారెడ్డి, తిమ్మారెడ్డి గ్రామ ఉప సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
3
సోమవారం | నవంబర్ 04, 2024 | www.navatelangana.com

ఐడిసిఎంఎస్ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-రెంజల్



చైర్మన్‌ను సన్మానిస్తున్న పలువురు

మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయానికి మొదటిసారిగా విచ్చేసిన ఐడిసిఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్‌ను సొసైటీ చైర్మన్ మొయినుద్దీన్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయనతో పాటు వీరన్నగుట్ట తాండ మాజీ సర్పంచ్ గణేష్ నాయక్, సదానంద్ రైస్‌మిల్ యజమాని అశోక్ సేట్, జన వికాస్ సేవా సంస్థ జిల్లా అధ్యక్షులు తెడ్డు పోశెట్టి, నవీపేట్ మాజీ ఎంపీపీ సూరిబాబు, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు అగ్గు నారాయణ, సాయిలు, కార్యదర్శి ఇంద్రసేన్ తదితరులు పాల్గొన్నారు.



తాడ్వాయి: చేపపిల్లను చెరువులో వదులుతున్న ఎమ్మెల్యే

చేపల మార్కెట్ యార్డు నిర్మిస్తాం

- ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలో రూ.10 లక్షల నిధులతో చేపల మార్కెట్ యార్డ్ నిర్మాణం చేపడతామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు అన్నారు. ఆదివారం తాడ్వాయి గ్రామ సమీపంలోని ఊర చెరువులో చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాంతంలో మత్స్య కార్మికులు వెనుకబడి ఉన్నారని తెలిపారు. దీంతో కుటుంబాలు అభివృద్ధి చెందాలన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 217 చెరువులున్నాయని, రూ.29.15 లక్షల విలువ గల చేప పిల్లలను పంపిణీ చేయనున్నట్టు వివరించారు. కార్మికులకు రూ.5లక్షల ప్రమాద బీమా కల్పించనున్నట్లు తెలిపారు. నియోజవర్గంలోని మండల కేంద్రాల్లో కమ్యూనిటీ భవనాల నిర్మాణం కోసం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి, చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, మాజీ ఈఎంసి చైర్మన్ శ్యామ్‌రావు, మాజీ సిడిసి చైర్మన్ మద్ది మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు మెట్టు రామచంద్రం, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మేకల రాజు, మాజీ సర్పంచ్ బండారి సంజీవులు, వర్కింగ్ కమిటీ అధ్యక్షులు నరేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు లక్ష్మణచారి, మండల మహిళా అధ్యక్షురాలు బలంభాయ్, శివాజీరావు, పులి బాబు, శ్రీకాంత్, గుట్టకాడి రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేస్తే సహించేది లేదు..

నందివాడలో మహిళలు కూడబెట్టుకున్న సొమ్మును స్వాహా చేసిన సిఎ బాబాగౌడ్‌పై వచ్చిన ఆరోపణలపై విచారణ చేపట్టి తప్పు చేసినట్లు నిర్ధారణ తేలితే సహించేది లేదని వాటిని రికవరీ చేస్తామని గ్రామ మహిళలకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హామీనిచ్చారు. నందివాడలో జరిగిన అవినీతిపై అధికారులు, మహిళలు, నాయకులతో కమిటీని ఏర్పాటుచేసి విచారణ చేయిస్తామన్నారు. ఆరోపణలపై వాస్తవాలు తేలితే బాబాగౌడ్‌పై కఠిన చర్యలతో పాటు ఆయన ఆస్తులను జప్తు చేయించి చెల్లించిన సొమ్మును వారికి తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి మహిళకు తాను సోదరుడిగా ఉంటానన్నారు. ఈ విషయంపై తక్షణమే విచారణ జరిపించేలా చూడాలని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్యామ్‌రావుకు బాధ్యతలు అప్పగించారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం గుర్తింపు కార్డులు అందజేత..



గుర్తింపు కార్డును అందజేస్తున్న ఎమ్మెల్యే

లింగంపేట్ : మండలంలోని మెంగారం గ్రామానికి చెందిన మత్స్యకారులకు ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు చేతుల మీదుగా నూతనంగా ఏర్పాటు చేసిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం గుర్తింపు కార్డులను ఎమ్మెల్యే చేతుల మీదుగా మత్స్య కార్మికులకు అందజేశారు. 37 మత్స్య కార్మికులకు గుర్తింపు కార్డులను, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పత్రాన్ని అందజేశారు. మేంగారం గ్రామంలో నూతనంగా ఏర్పడిన మత్స్య పరిశ్రమకు సహకార సంఘం తన వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం మత్స్యకారులు ఎమ్మెల్యేను శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతికి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య పరిశ్రమల సహకార సంఘం చైర్మన్ సత్యనారాయణ, తెలంగాణ ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు దాసరి సాయికుమార్, జిల్లా నాయకులు నామాల శంకర్, మత్స్య సహకార సంఘం మండలాధ్యక్షులు బెస్త సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎంతో మంది గొప్పవారయ్యారు..



విద్యార్థుల నుంచి అభివందనం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

రామారెడ్డి : ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎంతోమంది గొప్పవారయ్యారని ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు మదన్మోహన్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని పోసానిపేట జిల్లా పరిషత్ పాఠశాలలో అండర్ 14, 68వ రాష్ట్రస్థాయి బాలికల ఖోఖో క్రీడలను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అంతకుముందు గౌతమ బుద్ధుని, మహాత్మా జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలను ఆవిష్కరించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా జిల్లాల క్రీడాకారుల గౌరవ వందనాన్ని స్వీకరించారు.

ఈ సందర్భంగా మదన్ మోహన్ రావు మాట్లాడుతూ.. ఇది రాజకీయ వేదిక కాదని, రాజకీయాల్లో ఆదర్శంగా ఉండాలని సూచించారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాల రామారెడ్డి, ఎర్రపహాడ్ పాఠశాలలో తెలుగు మీడియంలో చదివానని గుర్తు చేశారు. విద్యార్థులను, కుటుంబాలను, సమాజాన్ని, టెక్నాలజీ విచ్ఛిన్నం చేస్తుందని, దీని నుంచి క్రీడలు కాపాడుతాయని, ఆటల్లో గెలుపోటములు సహజమని, ఏకగ్రతతో, ధ్యానంతో ఆడితే ఫలితాలు దానంతట అవే వస్తాయని అన్నారు. అవగాహన అనేది చాలా ముఖ్యమని, మొక్కై వంగని మానై వంగునా అన్నట్లు విద్యార్థులు చిన్నతనంలోనే తమ లక్ష్యాలను ఎంచుకొని ప్రణాళికాబద్ధంగా కష్టపడి లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఎంపీడీవో తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ దశరథ్‌రెడ్డి, మాజీ జెడ్పిటిసి నారెడ్డి మోహన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ముత్తినేని రవీందర్‌రావు, మాజీ సర్పంచ్ గిరెడ్డి మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లక్ష్మాగౌడ్, ఎంఈఓ ఆనందరావు, సొసైటీ అధ్యక్షులు సదాశివరెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షులు సంగ్య నాయక్, నాయకులు ప్రవీణ్‌గౌడ్, ఇర్షాద్, మనోహర్‌రెడ్డి, నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పోతుల చిన్న భాస్కర్, ఆయా జిల్లాల క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

గోవులకు సేవ

- యువతను ప్రశంసించిన గ్రామస్తులు

నవతెలంగాణ-రెంజల్



గడ్డిని ట్రాక్టర్‌లో వేస్తున్న పలువురు

మండలంలోని వీరన్నగుట్ట హనుమాన్ గోమాతల సేవ కోసం స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన యువతను గ్రామస్తులు ప్రశంసించారు. రైతుల పంట పొలాలలో 150 గడ్డి కట్టలను గ్రామానికి చెందిన మహేష్, మిద్దె శంకర్‌గౌడ్, లక్ష్మణ్ గౌడ్, బాలకృష్ణ తమ సొంత ట్రాక్టర్లను తీసుకురాగా, గడ్డి కట్టలను ట్రాక్టర్లో వేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన మస్కం స్వామి, శివ గౌడ్, వెంకటేష్, రాయమల్లు, వరుణ్ గౌడ్, సతీష్, శంకర్ గౌడ్, ఆనంద్, మధుకర్, గోశాల సేవకులు వెంకటేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే గోమాతల ఆకలి తీర్చడానికి 100 కట్టల కోసం ముక్తేశ్వర స్వామి, 50 కట్టల కోసం ఆకారం సాయిలు ముందుకు రావడం అభినందనీయమని వారు ఈ సందర్భంగా వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

మత్తడి పోచమ్మ ఆలయ కమిటీ ఎన్నిక

- అధ్యక్షులుగా దురిశెట్టి అశోక్



ఆలయ కమిటీ ఎన్నికైన సభ్యులు

నవతెలంగాణ-లింగంపేట్

మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయ కమిటీని స్థానిక మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయంలో ఆయా కుల సంఘాల పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పనిచేసిన బొల్లారం సాయిలు ఇటీవల మృతిచెందడంతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా దురిశెట్టి అశోక్, ఉపాధ్యక్షులుగా ఆకుల సంగయ్య, ప్రధాన కార్యదర్శిగా గౌడ రవి, సహాయ కార్యదర్శిగా రాజారం బాలయ్య, కోశాధికారిగా మారుతి, కార్యవర్గ సభ్యులుగా సంఘం పెద్దలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారిచేత ప్రమాణస్వీకారం చేయించారు. ఆలయ అభివృద్ధికి అందరూ కష్టపడి పనిచేయాలని వారన్నారు. ఈ సమావేశంలో గ్రామ పెద్దలు శంకర్ గౌడ్, నారాగౌడ్, కమ్మరి వెంకటేశం, ఆకుల సంగయ్య, కౌడ శ్రీనివాస్, మారుతి, నారాయణ, మనోజ్‌గౌడ్, నరసింహులు, చందు, రాజాగౌడ్, రాజు, తిరుపతి ఆయా కులసంఘాల పెద్దలు, గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ డివికె స్మారక విగ్రహావిష్కరణ సభ పోస్టర్ల ఆవిష్కరణ

నవతెలంగాణ-బోధన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవంబర్ 9న ఆర్మూర్‌లో జరిగే కామ్రేడ్ డివికె స్మారక విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో సాలూర మండల కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ మాట్లాడుతూ.. నవంబర్ 9న ఆర్మూర్ పట్టణంలో కామ్రేడ్ కుమార్ నారాయణ భవన్ వద్ద జరిగే కామ్రేడ్ డివికె స్మారక విగ్రహావిష్కరణ, సభకు కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఆయన విప్లవ కమ్యూనిస్టు ఆశయాల కోసం చివరి శ్వాస దాకా అవిశ్రాంతంగా పనిచేసిన విప్లవ యోధుడని, మార్క్సిజం పిడివాదం కాదని మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా భారత విప్లవోద్యమానికి మార్క్సిజాన్ని అన్వాయించిన భారత తాత్వికవేత్త అని కొనియాడారు. అతివాదం, మితవాదం విప్లవోద్యమానికి నష్టకరమని.. ప్రజలే చరిత్ర నిర్మాతలని ప్రజాపంథా మార్గమే భారత విప్లవోద్యమానికి మార్గమని దిశానిర్దేశం చేసిన విప్లవ దిక్సూచి కామ్రేడ్ డివికె అని విప్లవోద్యమ పురోగతికి ప్రజా పంథానే సరియైన మార్గం అని విప్లవోద్యమానికి నూతన పోరాట మార్గాన్ని అందించిన గొప్ప వీర యోధుడు కామ్రేడ్ డీవీకే అన్నారు. కార్యక్రమంలో అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు పడాల శంకర్, మండల నాయకులు బి.సాయిలు, జి.నాగేష్, ఇర్షాద్, లక్ష్మణ్, గంగన్న, పోశెట్టి, రామన్న రామారావు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

ధర్మ యుద్ధ మహాసభకు
తరలివెళ్లిన ఎమ్మార్పీఎస్ నాయకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి



ధర్మ యుద్ధ మహాసభకు తరలిన నాయకులు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో తలపెట్టిన ధర్మ యుద్ధ మహాసభకు ఎల్లారెడ్డి మండలంలోని వివిధ గ్రామాల నుండి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కంతి పద్మారావు ఆధ్వర్యంలో ధర్మ యుద్ధ మహాసభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా కంతి పద్మారావు మాట్లాడుతూ ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో జరుపుకోవాలని తీర్పు వెలువరించిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్గీకరణ చేస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి నెలలు గడిచినా వర్గీకరణ గురించి పట్టించుకోవడంలేదని అన్నారు. వర్గీకరణ చేయకుండా మాదిగ ఉప కులాలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయనకు మాదిగలమంతా ఏకమై తగిన బుద్ధి చెప్తామన్నారు. నేటి ధర్మ యుద్ధ సభలో తమ అధినాయకుడు మందకృష్ణ నిర్దేశించే బాటలో ముందుకు సాగుతూ ఉద్యమిస్తామన్నారు.

షబ్బీర్ అలీని కలిసిన మొదటి ర్యాంకర్



నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీని ఎస్‌జిటి డీఎస్సీ పరీక్షలో రాష్ట్ర, జిల్లా మొదటి ర్యాంకు సాధించిన జిల్లా అభ్యర్థి కోటగిరి మౌనిక ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ ఆమెను శాలువాతో ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ 2024 ఫలితాల్లో ఎస్జీటీ (తెలుగు) విభాగంలో తొలి ప్రయత్నంలోనే పిట్లం మండలం మర్దండా గ్రామానికి చెందిన కోటగిరి మౌనిక 88.77 మార్క్స్ సాధించి కామారెడ్డి జిల్లాస్థాయిలో తొలి ర్యాంక్ సాధించింది. అలాగే రాష్ట్ర స్థాయిలో ఎస్జీటీ (తెలుగు) విభాగంలో టాప్ స్కోరర్‌గా నిలిచింది. ప్రస్తుతం కామారెడ్డి మండలంలోని షాబ్దిపూర్ తండా గ్రామ ప్రభుత్వ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి-తెలుగు)గా విధులు నిర్వర్తిస్తున్నారు. అనంతరం షబ్బీర్ అలీ మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులకు మంచి విద్యను బోధించి, విద్యార్థుల భవిష్యత్తుకు మార్గ నిర్దేశం చేసి విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకునేలా చేసి, జిల్లాకి, రాష్ట్రానికి మంచిపేరు తీసుకురావాలి అని అన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

- ఎస్ఐ నరేష్

నవతెలంగాణ-రామారెడ్డి



వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఎస్ఐ

వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పకుండా పాటించాలని ఎస్సై నరేష్ వాహనదారులకు సూచించారు. ఆదివారం మండలంలోని గొల్లపెల్లి స్టేజ్ వద్ద వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు సీటు బెల్టును ధరించాలని, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్‌ను ఉపయోగించుకోవాలని, ధ్రువపత్రాలను కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని, మైనర్లకు వాహనాలు నడపడానికి ఇచ్చి ప్రమాదాలకు కారకులు కావొద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రవీందర్, సిబ్బంది పవన్, గణేష్ తదితరులున్నారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు నమోదు

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ ప్రాంతంలో రెండు రోజుల క్రితం ఓ బాలిక (13) తన ఇంటికి వెళుతున్న క్రమంలో అక్కడే ఉన్న నర్సాపూర్‌కు చెందిన వ్యక్తి బాలిక చేయిపట్టి టపాసులు నీపై వేస్తానని భయపెట్టిన ఘటనలో బాలిక కుటుంబీకులు ఫిర్యాదు మేరకు బాలికను భయపెట్టిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు బోధన్ పట్టణ సిఐ వెంకటనారాయణ తెలిపారు.

సాలూరలో ధాన్యం కొనుగోలు ప్రారంభం




కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మెన్ అల్లె జనార్దన్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్నారని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏ- గ్రేడ్ ధాన్యానికి రూ.2320, బీ-గ్రేడ్ ధాన్యానికి రూ.2300 మద్దతు ధర ప్రభుత్వం రైతులకు చెల్లిస్తుందని కావున రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, కాంగ్రెస్ నాయకులు అల్లె రమేష్, రైతులు రామయ్య రమేష్, ఖదీర్, సురేష్ పటేల్, నాగరాజు, సొసైటీ సీఈఓ బస్వంత్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రానికి చెందిన కటికే యాదమ్మ మృతిచెందగా బాధిత కుటుంబం ఆర్థిక ఇబ్బందులున్నాయని తెలుసుకొని మండల కేంద్రానికి చెందిన అభయ హస్తం సిండికేట్ ఆధ్వర్యంలో రూ.3000 నగదు, 50 కేజీల బియ్యం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సిండికేట్ సభ్యులు మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు మదన్మోహన్‌రావు ఆధ్వర్యంలో అభయహస్తం సిండికేట్‌ను స్థాపించడం జరిగిందని, పేద ప్రజలకు ఆపన్నహస్తం అందించడమే ముఖ్య ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో సిండికేట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు సూపరిండెంట్‌కు అరుదైన గౌరవం



ఇండియా బుక్ ఆఫ్ రికార్డును అందుకుంటున్న సూపరిండెంట్

నవతెలంగాణ-ముప్కాల్
ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన గద్దల రమేష్ (కోర్టు సూపరెండేంట్) 'ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్'ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల చేతుల మీదుగా పొందడంతో ఆదివారం మధ్యాహ్నం మండల కేంద్రంలో గ్రామస్థులు ఆయనను ఘనంగా సన్మానించారు. గ్రామానికి చెందిన రమేష్‌కు ఈ అవార్డ్ రావడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయా కుల సంఘాల పెద్దలు, యువకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకారాన్ని అందిస్తా



నవతెలంగాణ-ముప్కాల్
ముప్కాల్ మాజీ సర్పంచ్, ప్రస్తుత భారతీయ రాష్ట్ర సమితి మండల అధ్యక్షులు ముస్కు భూమేశ్వర్ రెడ్డి ఆదివారం స్థానికంగా ఉన్న ఇండోర్ స్టేడియంను సందర్శించి క్రీడాకారులతో ముచ్చటించారు. స్టేడియం అభివృద్ధికి తనవంతు సహాయంగా రూ.51 వేల రూపాయలను అందజేస్తానని ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులకు హామీ ఇచ్చారని స్పోర్ట్స్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అకాడమీ సభ్యులు ముస్కు భూమేశ్వర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు గంగారాజ్, దినేష్, ప్రవీణ్, గోపి, రఘు, గంగాధర్, గిరిస్వామి తదితరులు పాల్గొన్నారు..

నేడు జక్రాన్‌పల్లికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి రాక

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
జక్రాన్‌పల్లిలో కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి సోమవారం వస్తున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిన్నారెడ్డి ఆదివారం తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో చెక్కులను పంపిణీ చేయనున్నట్టు పేర్కొన్నారు. మండలంలోని మండలంలోని లబ్దిదారులకు ఆయా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలియజేయాలని తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-మోపాల్
మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి 2007, 2008 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు, స్నేహితులు ఒక్కరిని ఒక్కరు కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను తోటి మిత్రులతో కలిసి నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో.పురుషోత్తం, రామ్ లక్ష్మన్, రామ్ రెడ్డి, రంజిత్, మహేష్, హరీష్, సురేష్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

జాతీయస్థాయి కథల పోటీల్లో ఏర్గట్ల విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఏర్గట్ల
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదవుతున్న అభిలాష్ అనే విద్యార్థి రాసిన "మంచిమనసు"అనే కథకు గాను, హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మాచిరాజు సాహిత్య కళా పీఠం అధ్యక్షులు కామేశ్వరరావు చేతుల మీదుగా నగదు బహుమతి, జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందుకున్నట్లు తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కేంద్ర సాహిత్య అకాడమీ కన్వీనర్ మృణాళిని, కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత దాసరి వెంకట రమణ, చొక్కాపు వెంకట రమణ, మోహన్, తదితరులు హాజరయ్యారని తెలిపారు. విద్యార్థిని అంతలా ప్రోత్సహించినందుకు గాను ప్రవీణ్ శర్మను తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, మాచిరాజు సాహిత్య కళా పీఠం వారు కలిసి ప్రత్యేకంగా శాలువాతో సన్మానించారు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి
జక్రన్‌పల్లి గ్రామ సమస్యలు తెలియజేస్తూ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని కాంగ్రెస్ నాయకులు ఆదివారం సన్మానించారు. మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సొప్పరీ వినోద్ కలసి దీపావళీ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డమీద అరవింద్‌గౌడ్ ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జక్రన్‌పల్లి సర్పంచ్ కాటిపల్లి నర్సారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-భీంగల్ రూరల్
ముచ్కూర్ సొసైటీ పరిధిలోని రాహతనగర్, కొత్త తండా, తాళ్లపల్లి, దేవక్కపేట్‌లో కొనుగోలు కేంద్రాలు ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బంగ్లా దేవేందర్, వైస్ చైర్మన్ భూరెడ్డి గంగారెడ్డి, డైరెక్టర్లు భూరెడ్డి రాజన్న, కైరి లక్ష్మి దశగౌడ్, తెడ్డు లావణ్య అశోక్, మలావత్ వెంకటేష్, ఓద్యాల లక్ష్మణ్, గాండ్ల బాలయ్య, బంగ్లా లక్ష్మి నర్సాగౌడ్, బింగల్ మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొదిరే స్వామి, నాయకులు, పాల్గొన్నారు.



ఓ హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారి (ఫైల్)

కల్తీ ఫుడ్ ఆగేనా?

చూసి చూడనట్టు వ్యవహరిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కార్పొరేషన్‌కు పూర్తిస్థాయిలో లేని హెల్త్ అధికారి

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ నగరం కల్తీ ఫుడ్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారుతుంది. వ్యాపార వాణిజ్య రంగంలో దినదిన అభివృద్ధి చెందుతున్న నగరం ఆహార నాణ్యత విషయంలో అట్టడుగున ఉందని చెప్పడం నమ్మలేని నిజం. స్టార్ హెూటల్స్ నుంచి మొదలుపెడితే రోడ్డు పక్కన టిఫిన్ సెంటర్ వరకు ఎక్కడ కూడా నాణ్యత పాటించకపోవడం గమనార్హం. గత కొద్ది రోజుల నుంచి ఎప్పుడు తనిఖీలు చేపట్టిన కిలోల చొప్పున నాణ్యతలేని మాంసాహార పదార్థాలు దొరుకుతుండడం నిదర్శనం. రోజురోజుకు నగరంలో పుట్టగొడుగుల్లా హెూటల్లు టిఫిన్ సెంటర్లు రెస్టారెంట్లు పుట్టుకొస్తున్న వాటిని పట్టించుకునే నాధుడే కరువయ్యాడు. లాభాపేక్ష ధ్యేయంగా బిర్యానీలు ఇతర ఆహార పదార్థాలపై ఆఫర్లు ప్రకటిస్తూ ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేస్తున్న అధికారుల చర్యలు మాత్రం శూన్యంగానే కనిపిస్తున్నాయి. హెూటల్ పై నిఘా ఉంచాల్సిన మున్సిపల్ శానిటేషన్ ఆహార భద్రత అధికారులు మామూళ్ల మత్తులో మునిగిపోయి నామమాత్రపు తనిఖీలు చేసి తమ జేబులు నింపుకొని వదిలేస్తున్నారని విమర్శలు వెలివిస్తున్నాయి. కార్పొరేషన్‌కు పూర్తిస్థాయి హెల్త్ అధికారులు లేకపోవడంతో సానిటేషన్ అధికారుల ఆడింది ఆట పాడిన పాటగా సాగుతుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రతిరోజు లక్షల కొద్ది వ్యాపారం చేసే హెూటల్కు 2000, 5000 ఫైన్ వేసి చేతులు దులుపుకుంటున్న అధికారులు తూతు మంత్రంగానే చర్యలు తీసుకుంటున్నారని బహిరంగంగానే అందరికీ అర్థమవుతుంది.

10 రోజుల క్రితం నగరంలో హైదరాబాద్ నుంచి వచ్చిన ఆహార భద్రత అధికారులు నగరంలోని పలు పెద్ద హెూటళ్లు, స్వీట్ హెూమ్ లో తనిఖీలు చేసి పెద్ద మొత్తంలో నాణ్యతలేని ఆహారాన్ని సీజ్ చేశారు. అయితే హైదరాబాద్ నుంచి ప్రత్యేక అధికారుల బృందం వచ్చి తనిఖీ చేసేంతవరకు నగరపాలక సంస్థ అధికారులు ఎందుకు చూసిచూడనట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నిజామాబాద్ నగరానికి ప్రతిరోజు వేలాది మంది రాకపోకలు సాగిస్తూ ఉంటారు.

ఈ క్రమంలో ఉదయం టిఫిన్ నుంచి రాత్రి భోజనం వరకు తప్పనిసరిగా హెూటల్లో తినాల్సిన పరిస్థితి వస్తుంది. పల్లెటూరు నుండి వచ్చేవారు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో హోటల్లో ఏది పెడితే అది తినాల్సి ఉంటుంది. కాబట్టి నెలనెలా తమ జీతాలు తీసుకునే ప్రభుత్వ అధికారులు మామూళ్ల మత్తులో ప్రజల ఆరోగ్యాలతో చెలగాటలాడద్దని నాణ్యత పాటించని హోటళ్లపైన కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నగరంలో గతనెలలో మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బంది అన్ని డివిజన్లో ఉన్న హెూటళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ ఎక్కడ కూడా కల్తీ ఆహారం దొరకకపోవడం గమనార్హం. తనిఖీల్లో భాగంగా నిజామాబాద్ బస్టాండ్ ఏరియాలో ఉన్న హెూటళ్లలో శానిటేషన్ సిబ్బంది తనిఖీ నిర్వహించి దాదాపు అన్ని హెూటళ్లకు 10వేల చొప్పున జరిమానా విధించినట్టు సమాచారం. అయితే ఏ ఏ హెూటల్లో తనిఖీలు చేపడుతున్నారు ఎంత జరిమానా విధిస్తున్నారు? ఎందుకోసం విధిస్తున్నారు, చిన్న చిన్న హెూటళ్లకే 10వేల జరిమానా విధించే మున్సిపల్ సిబ్బంది స్టార్ హెూటళ్లలో ఫ్రిజ్లో పెట్టిన నాణ్యతలేని మాంసపు పదార్థాలు దొరికినప్పుడు కేవలం 5వేల ఫైన్ తో ఎందుకు సరిపెడుతున్నారు? వీటన్నింటికీ సమాధానం మున్సిపల్ అధికారులే చెప్పాలి.

నగరంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ తో పాటు, సానిటేషన్ సిబ్బంది పూర్తిస్థాయిలో తనిఖీలు చేపడుతూ పలు హెూటళ్లకు ఒక్కో హెూటల్‌కు 10వేల జరిమానా విధించిన కూడా కనీసం మీడియాకు కూడా వివరాలు తెలుపకపోవడం గమనార్హం.

ఏదేమైనా నిజామాబాద్‌లో కల్తీ ఆహార పదార్థాలపై నియంత్రణ రోజురోజుకు కరువైతుంది. జిల్లా యంత్రాంగం పట్టించుకుంటే తప్ప నియంత్రణ జరగదని నగరంలో చర్చ జరుగుతుంది. హైదరాబాద్ నుండి వచ్చిన అధికారులు తనిఖీల్లో భాగంగా మూడు రోజులపాటు మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు నిఘాను ఉంచి పక్కాగా చర్యలు తీసుకున్నప్పుడే మంచి ఆహారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం

అహర్నిశలు శ్రమించిన ప్రొఫెసర్ జయశంకర్

- జిల్లా సిసిఎస్ ఏసిపి నాగేంద్ర చారి

నవతెలంగాణ-ఆర్మూర్
తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు శ్రమించిన మేధావి ప్రొఫెసర్ జయశంకర్ అని జిల్లా సిసిఎస్ ఏసీపీ నాగేంద్ర చారి అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్లో ఆదివారం జిల్లా విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ ఆచార్య విశ్వ స్ఫూర్తి, విశ్వ కీర్తి ప్రతిభా పురస్కారాల కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. శ్రీకాంత్ చారి తెలంగాణ రాష్ట్రం కోసం ఆత్మార్పణ చేశారని లక్ష్యసిద్ధి కోసం మహాత్ములు ఎంతటి త్యాగానికైనా వెనుకాడరని అలాంటి మహాత్ములని ప్రతి సంవత్సరం స్మరించుకొని వారి పేరిట పురస్కారాలు ఇవ్వడం చాలా గొప్ప విషయం అని అన్నారు. అందుకు విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా బాధ్యులను అభినందిస్తున్నానని తెలిపారు.. పిల్లలు ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని చదవాలని అనుకున్న రంగంలో ప్రథమ స్థానంలో నిలవాలంటే త్రికరణ శుద్ధిగా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగస్తులందరూ తమ మాతృశాఖ గౌరవాన్ని ఇనుమడింపజేసేలా విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించాలని తెలిపారు. గౌరవ అతిథి వచ్చిన నిజామాబాద్ నార్త్ మండలం తహసిల్దార్ నాగార్జున మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో విద్యార్థులు సాంకేతికతను ఉపయోగించుకొని దానికి అనుగుణంగా విద్య నేర్చుకోవాలని, దానికి విద్యార్థి దశ నుండే కృషి చేయాలని పిలుపునిచ్చారు. పెర్కిట్ మహిళా ప్రాంగణం మేనేజర్ శ్రీమతి పద్మజ మాట్లాడుతూ ప్రతి మహిళ, ప్రతి అమ్మాయి సమాజంలో జరుగుతున్న దుశ్చర్యలను గమనించాలని దానికి తగ్గట్టు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు.



పురస్కారాలు అందుకున్న పలువురు

తదనంతరం 30 మంది విద్యార్థిని విద్యార్థులకు విశ్వస్ఫూర్తి పురస్కారాలతోనూ... నూతనంగా ఉద్యోగంలో చేరిన వారికి , ఆయా శాఖలో ప్రమోషన్లు పొందిన వారికి రిటైర్డ్ అయిన వాళ్ళకి సామాజికంగా ఆయా రంగాల్లో రాణిస్తున్న విశ్వబ్రాహ్మణ ప్రముఖులందరినీ కలుపుకొని 50 మంది గోల్డ్ మెడల్, జ్ఞాపిక శాలువాతో సత్కరిస్తూ అవార్డులు ప్రధానం చేశారు. ఈ ఈ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ జిల్లా అధ్యక్షుడు నరసింహచారి, ప్రముఖ యూరాలజిస్ట్ డాక్టర్ ఆనంద్ కుమార్, ఎస్బిఐ చీఫ్ మేనేజర్ దొంతోజు హరికృష్ణ, విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణాచారి, విశ్వకర్మ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రాజారాం, కోశాధికారి శ్రీధర్, గౌరవ అధ్యక్షులు మనోహర చారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిరణ్, రాజన్న, నగర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు సదానంద్ చారి, ప్రభు, డివిజన్ కార్యదర్శి వి శ్రీనివాస్ నూనె రామచందర్ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

- చివరి గడువు ఈనెల 12

నవతెలంగాణ-డిచ్‌పల్లి
ఇందల్‌వాయి మండలంలోని ఏకలవ్య గురుకులంలో పని చేయడానికి ఔట్ సోర్సింగ్ పద్ధతిన క్యాటరింగ్ అసిస్టెంట్ (01), మెస్ హెల్పర్ (02), శానిటేషన్ (01)(మహిళా), ఎలక్ట్రీషియన్ కమ్ ప్లంబర్ (01) పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అదేశాలు జారీ చేసినట్లు ఏకలవ్య గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కేటరింగ్ విభాగంలో డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. మెస్ హెల్పర్, శానిటేషన్ కోసం 10 వ తరగతి, ఎలక్ట్రీషియన్ కమ్ ప్లంబర్ పోస్టుకు 10వ తరగతితోపాటు ఐటిఐ లేదా పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారై ఉండాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 12 లోపు ఇందల్ వాయి మండలంలోని గంగారం తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మాక్లూర్ తండా వద్ద ఉన్న ఏకలవ్య గురుకులంలో సమర్పించాలని తెలిపారు. పదవ తరగతి పూర్తి చేసిన బోనాఫైడ్ గల అభ్యర్థులు మాత్రమే అర్హులని, పూర్తి మెరిట్ ఆధారంగా నియామకాలు చేస్తామని తెలిపారు. ఇవి పూర్తి తాత్కాలిక పోస్టులని, రెగ్యులర్ ఉద్యోగుల నియామకం కొరకు ఇది వరకే నోటిఫికేషన్ విడుదలైందని, వీరి తొలగింపు ఏ క్షణంలోనైనా జరగవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఇందల్ వాయి ఏకలవ్య ప్రిన్సిపల్ నెంబర్ 83979 47334 సంప్రదించాలని తెలిపారు.

దరఖాస్తు సమర్పణ సమయం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని వివరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

5న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ధర్నా

నవతెలంగాణ-కంఠేశ్వర్
ఈనెల 5న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల ధర్నా ఉంటుందని తెలంగాణ ఆల్ పెన్షనర్ల అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామ్మోహన్రావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం పెన్షనర్ల అసోసియేషన్ ఆవరణంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బకాయిపడ్డ డిఏలు విడుదల చేయాలని, రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం లేని నగదు రహిత వైద్యం అన్ని ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రులలో అమలు చేయాలని అన్నారు. కమిటెడ్ వ్యాల్యూ ఆఫ్ పెన్షన్‌ను 12 సంవత్సరాలకు కుదించాలని, పిఆర్సి రిపోర్టు తెప్పించుకొని 30 శాతం ఫిట్మెంట్‌తో అమలు చేయాలని తెలిపారు. ఈ కుబేర్‌లో పెండింగ్ లో ఉన్న వైద్య చికిత్సకు అయిన బిల్లులు, రిటైర్ అయిన ఉద్యోగులకు రావాల్సిన "పెన్షనరీ బెనిఫిట్స్" వెంటనే విడుదల చేయాలని అన్నారు. 398స్పెషల్ టీచర్ల నోషనల్ ఇంక్రిమెంట్‌లు విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ నెల 5న తలపెట్టిన ధర్నాకు అధిక సంఖ్యలో రిటైర్డు ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మదన్మోహన్, కోశాధికారి ఈవీఎల్ నారాయణ, నిజామాబాద్ డివిజన్ అధ్యక్షుడు షిర్ప హనుమాన్లు, నిజామాబాద్ డివిజన్ కార్యదర్శి ప్రసాదరావు, నిజామాబాద్ డివిజన్ కోశాధికారి రాధా కిషన్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎన్‌డిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పలువురు

నవతెలంగాణ-మోపాల్
మండలంలోని బోర్గాం(పి) సొసైటీ పరిధిలోని బోర్గాం(పి) తానాకుర్ది గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఆదివారం ఎన్‌డిసిసి బ్యాంక్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం కేటాయించిన కొనుగోలు కేంద్రాల్లోని రైతులు ధాన్యాన్ని విక్రయించాలని ఆయన కోరారు. అలాగే సన్న వడ్ల సంచిపైన ముద్ర వేయడానికి హమాలి ఛార్జి ఎక్కువైనా కూడా సొసైటీ భరిస్తుందని, రైతుల ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. అలాగే వైస్ చైర్మన్ పదవి స్వీకారం తర్వాత తొలిసారి తానాకుర్ది గ్రామానికి వచ్చిన సందర్భంగా గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఇక్కడికి వచ్చిన స్థానికులు మాట్లాడుతూ మళ్లీ నాలుగో సారి కూడా శేఖర్ రెడ్డిని చైర్మన్ గా ఎన్నుకుంటామని అలాగే సకాలంలో ఫర్టిలైజర్ అందించడంలో కానీ రుణాలు అందించడంలో రైతులకు ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తూ సంఘం అభివృద్ధికి నిరంతరం పాటు పడుతున్నాడని రైతులు, గ్రామ ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జయ కృష్ణ, నారాయణ్ రెడ్డి, ప్రభాకర్, రఘు పటేల్, సుభాష్, బుజేందర్,అంగళి రవీందర్, సూర్య రెడ్డి,నారాయణ, డైరెక్టర్లు సీతఊట కృష్ణ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం



చైర్మన్‌ను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-ముప్కాల్
ఈ మధ్యకాలంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన కొత్తింటి ముత్యం రెడ్డిని ఆదివారం ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు ముప్కాల్ ఇండోర్ స్టేడియం ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఇండోర్ స్టేడియంకు తనవంతు సహకారాన్ని అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ సభ్యులు గంగారాజ్, దినేష్, ప్రవీణ్, గోపి, రఘు, గంగాధర్, గిరిస్వామి, అరవింద్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు..

బాధితురాలికి హ్యాండ్ బ్యాగ్ అప్పగింత

మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ హ్యాండ్ బ్యాగ్‌ను పోగొట్టుకుంది. పోగొట్టుకున్న హ్యాండ్ బ్యాగ్ రైల్వే స్టేషన్ వద్ద డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్ చందులాల్‌కు దొరికింది. ఆయన హ్యాండ్ బ్యాగ్‌లో వెతకాగా ఫోన్ నెంబర్ దొరికింది. ఆ ఫోన్ నెంబర్ ఆధారంగా బ్యాగ్ పోగొట్టుకున్న వారికి ఫోన్ చేసి తెలిపారు. బ్యాగులో ఉన్న 12 తులాల వెండి పట్ట గొలుసులు, రూ.1200 బాధితురాలికి అప్పగించారు. దీంతో బాధిత మహిళ సంతోషం వ్యక్తం చేసింది.



బ్యాగ్‌ను అప్పగిస్తున్న ట్రాఫిక్ హెడ్‌కానిస్టేబుల్

సైబర్ నేరాలపై అవగాహన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గంజాయి, మత్తుపదార్థాలు, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై జక్రాన్ పల్లి పోలీసులు ఆదివారం మండలంలోని కలిగోట్ గ్రామంలో అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల గురించి ఎస్సై తిరుపతి అవగాహన కల్పించారు కార్యక్రమంలో ఏఎస్ఐ సుశీల్ కుమార్, వెంకట్, పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



కంఠేశ్వర్‌లో బస్‌షెల్టర్ ఏర్పాటు చేయండి

- షెల్టర్ లేక అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- కొన్నిచోట్ల ఉన్నా నిరుపయోగమే

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని కంటేశ్వర్ ప్రాంతంలో బస్సు షెల్టర్ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అందుకు అనుగుణంగా ఆర్టిసి అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని అనడానికి నిదర్శనం కంఠేశ్వర్ ప్రాంతం. దశాబ్దాల కాలంగా కంఠేశ్వర్ ప్రాంతంలో బస్సు ఎక్కాలన్న దిగాలన్న ఇదే ప్రాంతాన్ని ప్రజలు ఎన్నుకున్నారు. నిజామాబాద్ ఆర్టీసీ బస్టాండ్ నుండి నిర్మల్, మెట్‌పల్లి, జగిత్యాల్ తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే కంఠేశ్వర్ దాటి వెళ్లాల్సిందే. ఇతర ప్రాంతాల నుండి బస్సు బస్టాండ్‌కి రావాలంటే కంటేశ్వర్ ప్రాంతం చేరుకున్నాకే వెళ్లాలి. ఈ ప్రాంతంలో బస్ షెల్టర్ లేక నిజామాబాద్ నగర ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు.

కంఠేశ్వర ప్రాంతంలో బస్సుఎక్కేందుకు బస్సుషెల్టర్‌ను మార్చారు. కంఠేశ్వర్ గుడిప్రధాన ద్వారం ముందు ఎక్కాల్సిన బస్సును వెనుక ద్వారం వద్ద ఎక్కాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే కంఠేశ్వర్ ముఖ ద్వారం ముందు నిల్చుని చూస్తే ఏ బస్సు ఎక్కడికి వెళ్తుంది.. అనేది తెలిసేది. ప్రస్తుతం ఎక్కాల్సిన ప్లేస్‌లో నుండి చూస్తే ఏ బస్సు దగ్గరికి వస్తే గాని తెలియని పరిస్థితి నెలకొంది. ఒకే సమయంలో రెండు మూడు బస్సులు వచ్చేసరికి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజుల వరకు అక్కడ ఆర్‌టిసి సిబ్బంది ఒకరిని ఉంచి ప్రయాణికులకు హెల్ప్ చేసేందుకు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఇప్పుడు అక్కడ ఎవరు కూడా ఉండడం లేదు. అదేవిధంగా గత మూడు నాలుగు సంవత్సరాల క్రితం కంఠేశ్వర్‌కు కూతవేటు దూరంలో ఎడమ పక్కన కుడి పక్కన వంద మీటర్ల చొప్పున రెండు మూడు ఏర్పాటు చేశారు. కానీ అవి ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయి. ఆర్టీసీ అధికారులు ప్రయాణికుల గోడును పట్టించుకుని బస్సు షెల్టర్లను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



గుడి లోపలివైపు ద్వారం వద్ద నిలబడ్డ ప్రయాణికులు

ఏటీఎం ధ్వంసం.. చోరీకి యత్నం

ఒకరి అరెస్టు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అర్సపల్లి ఎస్‌బీఐ ఏటీఎంను ధ్వంసం చేసి చోరీకి యత్నించిన వ్యక్తిని ఒకటో టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. 2న అర్ధరాత్రి ప్రిన్స్ హెూటల్ సమీపంలో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలోకి చొరబడిన వ్యక్తి ఏటీఎంను ధ్వంసం చేసి దొంగతనానికి యత్నించాడు. సమాచారం అందుకున్న పెట్రోలింగ్ కానిస్టేబుళ్లు అశోక్, నారాయణ గాలింపు చేపట్టి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. చోరీకి యత్నించిన వ్యక్తిని అమ్దాపూర్ గ్రామానికి చెందిన సంతోష్‌గా గుర్తించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ షాప్ ప్రారంభం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్ పల్లి మండలంలోని ఘన్పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన నూతన రేషన్ షాపును డిచ్ పల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్ పలువురు నాయకులతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు రేషన్ సరుకులను సక్రమంగా పంపిణీ చేయాలని రేషన్ డీలర్ రేకులపల్లి స్వాతికి సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిసి డెలిగేట్ ధర్మ గౌడ్, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేవకరుణ, మండల యువజన కాంగ్రెస్ నాయకులు చౌకీ వెంకటేష్, శంకర్ గౌడ్, బండి లక్ష్మి, శేరు లింగం తదితరులు పాల్గొన్నారు.

కనీస వసతులు లేవు

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి
- గ్రంథాలయం తనిఖీ



గ్రంథాలయ పరిసరాలను పరిశీలిస్తున్న చైర్మన్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ గ్రంథాలయంలో కనీస వసతులు లేవని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. టాయిలెట్ సమస్యను వారంలో పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. జిల్లా గ్రంథాలయ సెక్రటరీ బుగ్గారెడ్డితో ఫోన్‌లో మాట్లాడి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రంథాలయంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా బిల్డింగ్ కాంట్రాక్టర్‌తో మాట్లాడి త్వరగా బిల్డింగ్‌ను పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గ్రంథాలయంలో త్వరలోనే సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. మొట్టమొదటిసారిగా విచ్చేసిన ఆయనను మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అయ్యప్ప శ్రీనివాస్ శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సాయిబాబా గౌడ్, లైబ్రేరియన్ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు



నియామకపత్రం అందజేస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు కాముని సుదర్శన్

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కులగణన కుటుంబ సర్వేకు ప్రజలందరూ సహకరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాముని సుదర్శన్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాముని సుదర్శన్ హాజరై మాట్లాడారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం కామారెడ్డి టౌన్ వైస్ ప్రెసిడెంట్‌గా సామల బాలనర్సయ్యను, కామారెడ్డి టౌన్ ప్రధాన కార్యదర్శిగా అల్వాల గోపాల్, పట్టణ కార్యదర్శిగా కొండం చంద్రమౌళి, పట్టణ సహాయ కార్యదర్శిగా వెలగొండ దినేష్‌ను నియమించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చింతల శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెర రాజయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు మంజుల, జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జ్ రాజేందర్, కామారెడ్డి టౌన్ అధ్యక్షులు నర్సింహులు, ఎల్లారెడ్డి నియోజకవర్గం ఇన్చార్జి శ్రవణ్ కుమార్ గౌడ్, యూత్ ఇన్చార్జి అఖిల్ రావు, కామారెడ్డి టౌన్ బీసీ నాయకులు సామల బాల నరసయ్య, కొండం చంద్రమౌళి, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథ పాలకునికి సన్మానం



గ్రంథపాలకుడిని సన్మానిస్తున్న పాఠకులు, స్థానికులు

నవతెలంగాణ-బిచ్కుంద

మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో గత 40 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న షేక్ నిసార్ అహ్మద్ పటేల్ ఉద్యోగ విరమణ పొందగా స్థానికులు, గ్రంథాలయ పాఠకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు సీమగంగారాం మాట్లాడుతూ.. గ్రంథాలయంలో విధులు నిర్వహించి గ్రంథాలయ అభివృద్ధికి ఎంతో సేవ చేశారని తెలిపారు. ఈ గ్రంథాలయంలో చదువుకున్న విద్యార్థులు, పాఠకులు ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగ రంగాల్లో ఉద్యోగాలు సంపాదించారని ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహిపతి హన్మండ్లు, గాండ్ల మహేష్, మున్నూరుకాపు గ్రామ అధ్యక్షులు సాయిని అశోక్, ఉపాధ్యాయులు శివకాంత్, మన్నన్ సార్, పాఠకులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉమెన్స్ కాలేజ్ మైదానం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా..

- మద్యం సేవించడం, గంజాయి, పేకాటకు నిలయం
- బానిసవుతున్న యువత
- పట్టించుకోని పోలీసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఉమెన్స్ కాలేజ్ మైదానం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారింది. నిత్యం మద్యం సేవించడం, పేకాట ఆడడం గంజాయి తాగుతూ గొడవలు పడుతున్నారు. కానీ మూడవ టౌన్ పోలీసులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. పేకాటనే కాకుండా గంజాయి తాగుతూ గొడవలను సృష్టిస్తున్నారు. స్థానిక ప్రజలతోపాటు కళాశాలకు వెళ్లే విద్యార్థినిలపట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఈ ప్రాంతం గుండా వెళ్లాలంటేనే మహిళలు, చిన్నారులు, పెద్దవాళ్లు భయపడుతున్నారు. ఈ విషయంలో ఎవరైనా స్పందిస్తే వారిపై దాడులకు సైతం దిగుతున్నారు. దానికి తోడు పోలీసులు పట్టించుకోకపోవడంతో రోజురోజుకు మితిమీరిపోతున్నారు. దీనికి అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. స్థానిక పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో అనేక దేవాలయాలు ఉన్నాయి. ప్రజలు వస్తూ వెళుతుంటారు. ఇలాంటి సమయంలో ఏదైనా తప్పు జరిగితే బాధ్యులు ఎవరు అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఇలాంటి గొడవలు జరగకుండా పేకాట ఆడకుండా గంజాయి సేవించకుండా కట్టడి చేయాలని కోరుతున్నారు.



కళాశాల మైదానంలో పేకాట ఆడుతున్న యువత

సిలిండర్ పేలి ఆస్తి నష్టం

- ఆదుకోవాలని బాధితుని వేడుకోలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్‌వాయి మండలంలోని నల్లవెల్లి గ్రామంలో ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాద వశాత్తు భారత్ గ్యాస్‌కు చెందిన సిలిండర్ పేలడంతో తీవ్ర ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రామస్తులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం నల్లవెల్లి గ్రామానికి చెందిన జలాది నర్సయ్య, నల్లవెల్లి గ్రామ పరిధిలో ఉన్న భారత్ గ్యాస్ కనెక్షన్ తీసుకున్నారు. ఆదివారం ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాద వశాత్తు గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్ నుండి మంటలు వ్యాపించాయి. దీంతో ఉన్న టీవీ, వంట సామాగ్రి, ఫ్యాన్, బియ్యంతో పాటు తలుపులు, ఇతరత్రా కాలిపోయాయి. నర్సయ్య భార్య వనజ ప్రాణాలతో బయటపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న చుట్టుపక్కల వారు హుటాహుటిన గన్నారం వద్ద ఉన్న అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక శకటం వచ్చే వరకు తీవ్రనష్టం జరిగిందని బాధితుడు అవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని గ్రామస్తులు పేర్కొన్నారు.



భారత విప్లవోద్యమ పితామహుడు కామ్రేడ్ డీవీకే

- సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్

నవతెలంగాణ-కామారెడ్డి

భారత విప్లవోద్యమ పితామహుడు కామ్రేడ్ డివి కృష్ణ అని సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు ఏ.ప్రకాష్ అన్నారు. ఆదివారం ఆర్మూర్‌లో జరగనున్న కామ్రేడ్ డివి కృష్ణ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం పోస్టర్స్‌ను జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద గల ఆటో కార్మికులతో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిపిఐ (ఎంఎల్) ప్రజాపంథా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ విప్లవోద్యమ నిర్మాణం కోసం జీవితాంతం కృషి చేసిన మార్గదర్శకుడని కొనియాడారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విప్లవోద్యమ ఎత్తుగడలు పోరాటాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని నిరూపించిన విప్లవ కార్యదీక్షకుడని తెలిపారు. మార్క్సిజం అంటే పిడివాదం కాదని శాస్త్రీయ సోషలిజమని భారత విప్లవకారులు ఈ విషయం అర్థం చేసుకోవాలని భారత విప్లవ ఉద్యమానికి గొప్ప విప్లవ సిద్ధాంతాన్ని అందించిన ఉద్యమ యోధుడు అన్నారు. భారతదేశంలో విప్లవోద్యమం పురోగమనానికి భారతదేశ పరిస్థితులను అధ్యయనం చేసి విప్లవ ఎత్తుగడలను అందించిన విప్లవ రణధీరుడని పేర్కొన్నారు. కామ్రేడ్ డివికె విగ్రహ ఆవిష్కరణ 9న ఆర్మూర్‌లో ఉందని ఈ కార్యక్రమానికి ప్రతి ఒక్క మేధావి హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విగ్ర ఆవిష్కరణను ముఖ్య అతిథిగా సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కేజి రామచందర్ ఆవిష్కరించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ, రమేష్, సురేష్, ఎల్లన్న కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పత్తి కొనుగోలు ప్రారంభం



పత్తి కొనుగోల్లు ప్రారంభించిన పత్తిమిల్లు యజమాని

నవతెలంగాణ-మద్నూర్

మండలంలో హండేకెలూరు గ్రామపంచాయతీ పరిధిలోని వర్ధానంద్ కాటన్ ఇండస్ట్రీస్ పత్తి మిల్లులో పత్తి కొనుగోళ్లను ఆదివారం ప్రారంభించారు. పత్తి మిల్లు యజమాని జ్ఞాను సెట్ దెగ్లూర్ కుటుంబ సభ్యులంతా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొనుగోళ్ల ప్రారంభోత్సవంలో పత్తి మిల్లుల వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లు హాజరయ్యారు. పత్తి ధర క్వింటాలుకు రూ.7,101 ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పత్తి రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి, షాదిముబారక్, సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-డిచ్‌పల్లి

నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని డిచ్ పల్లి, ఇందల్ వాయి, ధర్పల్లి, సిరికొండ, జక్రాన్‌పల్లి మండలాల లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి చేతుల మీదుగా ఉంటుందని ఆయా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అమృతపూర్ గంగాధర్, మోత్కురి నవీన్ గౌడ్,సీనియర్ నాయకులు డాక్టర్ శాదుల్లా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిచ్ పల్లి మండల కేంద్రంలోని ఎస్ ఎల్ జీ ఫంక్షన్ హాల్‌లో చెక్కులను పంపిణీ కార్యక్రమం ఉంటుందని లబ్దిదారులు సమయానికి తరలి రావాలని సూచించారు. కళ్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ చెక్కులు (131), ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు (117) పంపిణీ కార్యక్రమం ఉంటుందని రూరల్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షులు తారాచంద్ నాయక్



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రెంజల్

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాలని జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ అధ్యక్షులు తారాచంద్ నాయక్ స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని వీరన్నగుట్ట గ్రామంలో జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి సహాయ సహకారాలతో మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెంజల్ సింగిల్ విండో చైర్మన్ మొహీనుద్దీన్, వీరన్నగుట్ట తాండ మాజీ సర్పంచ్ గణేష్ నాయక్, ఉప సర్పంచ్ వీరేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హాజీఖాన్, అశోక్ సేట్, సొసైటీ డైరెక్టర్ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

తూకంలో జాప్యం ఉండొద్దు

- తహసీల్దార్ నరేందర్
- కొనుగోలు కేంద్రం సందర్శన

నవతెలంగాణ-లింగంపేట్

తూకంలో జాప్యం లేకుండా చూడాలని తహసీల్దార్ నరేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. మండలంలోని శెట్టిపల్లి సంగారెడ్డి, పర్మల్ల గ్రామాల్లో గల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. సీరియల్ ప్రకారమే తూకం వేయాలని ఆయన నిర్వాహకులకు సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా కొనుగోలు కేంద్రాల్లో వరుస క్రమంలోనే తూకం వేయాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట రైతులు, హమాలీలు తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని మర్కల్ గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04లో పదవ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 20 సంవత్సరాలు పూర్తవడంతో టేక్రియాల్ సమీపంలో గల పర్ణిక ప్యాలెస్‌లో పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారికి విద్యాబుద్ధులు నేర్పిన వారికి ఘనంగా సన్మానం చేసి గత జ్ఞాపకాలను స్మరించుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.

